టీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ పంజా



- తాడేపల్లిగూడెంలో రికార్డులు స్వాధీనం
- మునిసిపాలిటీలో కలకలం
- వైసీపీ హయాంలో దందా
- రూ.150 కోట్లు విలువైన బాండ్‌ల జారీ
- స్థల యజమానులకు కుచ్చుటోపీ
- అధికారుల బలి

భీమవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో మంజూరైన టీడీఆర్ బాండ్‌లపై విజిలెన్స్ పంజా విసిరింది. మునిసిపాలిటీలో తనిఖీలు నిర్వహించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమంగా మంజూరు చేసిన బాండ్‌ల వివరాలను సేకరించింది. విజిలెన్స్ డీఎస్పీ ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు. ఇదివరకే మునిసిపల్ పరిపాలన శాఖ వివరాలను రాబట్టింది. మునిసిపాలిటీ వివరాలను సమర్పించింది. ప్రస్తుతం విజిలెన్స్ బృందం దృష్టి సారించింది. మున్ముందు సీబీసీఐడీ కూడా రంగ ప్రవేశం చేసే అవకాశాలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీఆర్ బాండ్‌లపై దృష్టిపెట్టారు. తాడేపల్లిగూడెం కూటమి నేతలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. గతంలోనూ వైసీపీ ప్రభుత్వంపై, స్థానిక వైసీపీ నేత దందాపైనా కూటమి నేతలు అస్త్రాలు సంధించారు. అధికారులను నిలదీశారు. అయినా బాండ్‌ల జారీ ఆగలేదు. ఎన్నికల ముందు వైసీపీ నేత సొంత స్థలానికి రూ.15 కోట్లు విలువైన బాండ్‌లు జారీచేసేలా ప్రయత్నాలు చేస్తే తెలుగుదేశం నేత అడ్డుతగిలారు. మునిసిపల్ ప్రత్యేక అధికారికి విషయాన్ని చేర్చారు. దాంతో సదరు బాండ్‌ల జారీ నిలిచిపోయింది. అప్పటికే ఇతర ప్రాంతాల్లో స్థల యజమానులకు సంబంధించి అక్రమంగా బాండ్‌లు జారీఅయ్యాయి. వీటిపై తాజాగా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. బాండ్‌లు ఎలా జారీచేశారు. అంత అవసరం ఏమిటి? ఏ ప్రాంతంలో ఇచ్చారు? నిబంధనలు పాటించారా అంటూ మునిసిపల్ అధికారుల నుంచి వివరాలను సేకరించారు. గతంలో మంజూరు చేసిన బాండ్‌లపై మునిసిపాలిటీ పూర్తి వివరాలను సమర్పించింది.

పక్కా ప్లాన్

తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో వైసీపీ హయాంలో దాదాపు రూ. 150 కోట్లు విలువ చేసే బాండ్‌లను మంజూరు చేశారు. వైసీపీ నేత అండదండలున్నాయన్న ఉద్దేశంతో అధికారులు నాడు బరితెగించారు. వైసీపీ నేతకు సాగిలబడ్డారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉన్నతాధికారులు సహకరించారు. మునిసిపల్ శాఖలో కీలకంగా వ్యవహరించిన మహిళా ఉన్నతాధికారికి కూడా ముడుపులు అందాయి. దాంతో తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో అక్రమంగా బాండ్‌లు జారీఅయ్యాయి. భవన నిర్మాణంలో విడచిపెట్టిన సెట్‌బ్యాక్‌లకు కూడా బాండ్‌లు ఇచ్చేసిన ఘనతను అధికారులు మూటగట్టుకున్నారు. స్థల యజమానులకు తెలియకుండానే బాండ్‌లు జారీ అయిపోయాయి. బిల్డర్లు వాటిని విక్రయించుకున్నారు. వైసీపీ నేతకు పెద్దమొత్తంలో ముడుపులు అందించారు. భీమవరం పట్టణానికి చెందిన ఓ దళారి మధ్యవర్తిగా ఉండి బాండ్‌లు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయనకు వైసీపీ నేత రూ.2.50 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఆ మొత్తాన్ని వైసీపీ నేత ఎగనామం పెట్టారు. ఇద్దరి మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. బాండ్‌ల జారీ తతంగమంతా బయటకు వెల్లడైంది. మరోవైపు బాధితులు సైతం కూటమి నేతలను ఆశ్రయించారు. వీటన్నింటినీ క్రోడీకరించి కూటమి నేతలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అక్రమ టీడీఆర్ బాండ్‌లపై ప్రభుత్వం విచారణ చేపడుతోంది.

విస్తరణ పేరుతో బాండ్ల జారీ

తాడేపల్లిగూడెం-భీమవరం రహదారికి ఆనుకుని ఉన్న షాపులకు టీడీఆర్ బాండ్‌లు ఇచ్చిన ఘనతను మునిసిపాలిటీ దక్కించుకుంది. ప్రస్తుతం 80 అడుగుల విస్తీర్ణంలో రహదారి ఉంది. మాస్టర్ ప్లాన్‌లో 100 అడుగుల రహదారి ఉండడంతో విస్తరణ పేరుతో బాండ్‌లు జారీచేశారు. వాస్తవానికి అక్కడ రహదారి విస్తరణ జరిగే అవకాశం లేదు. అయినా సరే కొందరు ఉద్దేశపూర్వకంగా మునిసిపాలిటీకి స్థలాలను రాసి ఇచ్చేశారు. అందుకు నాలుగు రెట్లు విలువైన బాండ్‌లు తీసుకున్నారు. ఇప్పటికీ ఆ స్థలంలో షాపులున్నాయి. మునిసిపాలిటీ స్థలాలను స్వాధీనం చేసుకోలేదు. చేసుకున్నాసరే రహదారి విస్తరణకు అవకాశం లేదు. ఇదిలా ఉంటే తాడేపల్లిగూడెం-భీమవరం రహదారికి ఆనుకుని ఉన్న 2000 చదరపు గజాల స్థలంలో భవన నిర్మాణానికి స్థల యజమానులతో ఒప్పందం చేసుకున్న బిల్డర్ తన పేరుతో టీడీఆర్ బాండ్‌లు పొందారు. మునిసిపాలిటీకి దాదాపు 800 గజాల స్థలాన్ని ఇచ్చారు. నిబంధనల ప్రకారం నాలుగు రెట్లు అంటే 3200 గజాల బాండ్‌లను తీసుకున్నారు. మార్కెట్‌లో బాండ్‌లు విక్రయించుకున్నారు. కోట్ల రూపాయల లబ్ధిపొందారు. వైసీపీ నేతకు అందులో ముడుపులు చెల్లించారు. స్థల యజమానులకు మాత్రం ఒక్కపైసా ముట్ట చెప్పలేదు. అదే స్థలంలో నిర్మించే అపార్ట్‌మెంట్‌కు అదనపు నిర్మాణాలు చేపట్టేలా టీడీఆర్ బాండ్‌లను వినియోగించుకుంటామని నమ్మబలికారు. ఇప్పటికీ భవన నిర్మాణం జరగడం లేదు. బాండ్‌లను విక్రయించి స్థల యజమానులకు మోసం చేశారు. ఇవన్నీ ఇప్పుడు అధికారుల మెడకు చుట్టుకుంటున్నాయి. బాండ్‌లు జారీచేసిన గత అధికారుల్లో వణుకుపుడుతోంది. వైసీపీ నేత తమను నిట్ట నిలువునా ముంచేశారంటూ గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ నేత కోట్లు సంపాదించారు. అంటకాగిన అధికారులు బలికానున్నారు.



ప్రభుత్వ స్కూళ్లలో

సరికొత్త ప్రయోగం

- 7న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం
- విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేత
- జిల్లా వ్యాప్తంగా 1375 స్కూళ్లలో సమావేశాలు



విద్యార్థులకు అందించే ప్రోగ్రెస్ కార్డు

నరసాపురం/భీమవరం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఓ ఆత్మీయ వారధి నిర్మించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లల్లో కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. అదే ప్రతి విద్యార్థికి తల్లిదండ్రుల సమక్షంలో సమగ్ర ప్రగతి పత్రం (ప్రోగ్రెస్‌కార్డు) అందించాలని నిర్ణయించింది. దీనికి ఈనెల 7న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ అని నామకరణం చేశారు. దీన్ని జిల్లా వ్యాప్తంగా పండుగలా నిర్వహించేందుకు జిల్లా విద్యశాఖ అన్ని ఏర్పాట్లను చేపట్టింది. మొత్తం 1375 స్కూళ్లలో 99784 మంది విద్యార్థులకు ఆ రోజున పేరెంట్స్ సమక్షంలో ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు స్కూళ్లల్లో చురుగ్గా సాగుతున్నాయి. దీన్ని పండుగలా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ రూ.26.18లక్షలను మంజూరు చేసింది. ఇప్పటి వరకు ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అంటూ అందించడం లేదు. దీని వల్ల పిల్లలు ఎలా చదువుతున్నారు... ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు? ఎన్ని మార్కులు వస్తున్నాయి? అసలు విద్యార్థులు స్కూళ్ళకు రెగ్యులర్‌గా వెళుతున్నారా లేదా అన్న విషయాలు తల్లిదండ్రులకు పూర్తిగా తెలియడం లేదు. వీటిని విద్యార్థి సమక్షంలోనే తల్లిదండ్రులకు తెలియజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఓ ఆత్మీయ వారధి ఏర్పడేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం భావించింది.

అన్ని వివరాలతో ప్రోగ్రెస్ కార్డు

ఇక విద్యార్థులకు అందించే ప్రోగ్రెస్ కార్డులో చదువుకు సంబంధించి అన్ని వివరాలు ఉంటాయి. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేరు, క్లాస్, వచ్చిన మార్కులు, హాజరుశాతం, బ్లడ్ గ్రూప్, ఎత్తు, ఆధార్‌నెంబర్, రోల్ నెంబర్, అడ్మిషన్ నెంబర్, పుట్టిన తేదీ, బరువు, పుట్టుమచ్చలు, అపార్ ఐడీ, పర్మినెట్ ఎడ్యుకేషన్ నెంబర్, తల్లిదండ్రుల ఇద్దరి ఫోన్ నెంబర్లు, శాశ్వత అడ్రస్ తదితర అంశాలు ఉంటాయి. ఎనిమిది పేజీలతో ఇచ్చే ఈ ప్రోగ్రెస్ కార్డు విద్యార్థి జీవి తాతం గుర్తుంచుకునే విధంగా ముద్రించారు.

రాజకీయాలకు అతీతంగా సమావేశం

ఏ సమావేశం జరిగినా ప్రజాప్రతినిధులను పిలుస్తారు. కానీ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో రాజకీయాలకు అతీతంగా సాగనుంది. పాఠశాల అలంకరణలో పర్యావరణహిత సామగ్రిని ఉపయోగించనున్నారు. మామిడి తోరణాలు, అరటి మొక్కలు ఇలా ఆకట్టుకునేలా అలంకరణ చేయాల్సి ఉంది. తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు తాడు లాగే పోటీలు నిర్వహిస్తారు. ప్రధానంగా పాఠశాలల వద్ద సమావేశాలు జరిగేటప్పు డు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని నిబంధన పెట్టారు.

ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యం: కలెక్టర్

భీమవరం రూరల్: పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచడమే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం బ్యాంకు కాలనీలో విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులు ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆ సబ్జెక్టులపై శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థినిలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ నారాయణ, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ దందాపై కన్నెర్ర

పక్కదారి పడుతున్న బియ్యంపై నిఘా

జిల్లాలో 770 క్వింటాళ్ల బియ్యం సీజ్



తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):పీడీఎస్ దందాపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేసింది. ఈ దందాపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రంగంలోకి దిగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మాఫియా ఏం చేయాలో తోచక భయ పడుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న జనవరి నుంచి ఇప్పటి వరకు 57 కేసులు నమోదుచేశారు. వాటిలో టన్నుల కొద్ది బియ్యం సీజ్ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించే ఉచిత బియ్యాన్ని అక్రమార్కులు పేదలకు డబ్బులు ఎరచూపి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. ఈ మాఫియా ఎంత వరకు విస్తరించిందంటే ప్రభుత్వాలనే శాశించే స్థాయిలో నిర్వహిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో 5లక్షల 67వేల 651 తెల్లరేషన్ కార్డులు ఉంటే ప్రభుత్వం నుంచి 90శాతం మంది బియ్యం తీసుకుంటున్నారు. అంటే 5లక్షల 14వేల మందికి 7900 మెట్రిక్ టన్నుల బియ్యం పేదలకు అందిస్తున్నారు. వాటిలో 40శాతం బియ్యం మాఫియా మాటు వేసి మాయం చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. అంటే 3160 మెట్రిక్ టన్నుల బియ్యం పక్కదారి పడుతున్నట్టు అంచనా.

టీవీఎస్ నుంచి షిప్‌ల వరకు

పీడీఎస్ బియ్యంను చిన్నపాటి వ్యాపారి ఎంతో కొంత వస్తుందని టీవీఎస్ వాహనాల్లో ఇళ్ల నుంచి కొనుగోలు చేస్తుంటే పట్టణాల్లో రేషన్ డీలర్ల నుంచి మిని వ్యాన్‌లు, లారీలు ఇలా బియ్యం తరలిస్తున్నారు. చివరికి ఈ వ్యాపారం షిప్‌ల వరకూ విస్తరించి పోతోంది. ఈ వ్యాపారం చైన్ లింక్ పట్టుకుని పైస్థాయి వ్యాపారులను కట్టడి చేస్తే బియ్యం పక్కదారి పట్టకూడదనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు అధికారులు పీడీఎస్ అక్రమ తరలింపుపై దాడులు నిర్వహించి అనేక కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు 57 కేసులు నమోదు చేసి 7700 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేయడంతోపాటు 35 వాహనాలు సీజ్ చేశారు. ఈ దాడులు రాబోయే రోజుల్లో మరింత ఉధ్రతం చేయాలని అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

ప్రచారం పరిసమాప్తం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు
- రేపే పోలింగ్.. జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు
- బరిలో ఐదుగురు.. ఓటు వేయనున్న 3,729 మంది టీచర్లు
- ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల వినియోగం
- అభ్యర్థుల మధ్య హోరాహోరీ.. మద్యం దుకాణాలు బంద్



బొర్రా గోపిమూర్తి, గంధం నారాయణరావు, దీపక్, కవల నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి

భీమవరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం తుది దశకు చేరుకున్నది. ఇప్పటికే పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. ప్రత్యేకించి ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను ఓటింగ్‌కు వినియోగిస్తారు. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. యధావిధిగానే కోడ్ అమలులో ఉంది కాబట్టి మంగళవారం సాయంత్రం నాటికే ఎక్కడిక క్కడ మద్యం దుకాణాలను బంద్ చేశారు. 2023లో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎన్నిక అనివార్యమైంది. ఈఎన్నికలల్లో ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బొర్రా గోపిమూర్తి (భీమవరం), గంధం నారాయణరావు (ద్రాక్షారామం), నామన వెంకట లక్ష్మి (సామర్లకోట), కవల నాగేశ్వరరావు (రాజమహేంద్రవరం), పులుగు దీపక్ (తాడేపల్లిగూడెం) తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. తొలి సారిగా గోపిమూర్తి బరిలో ఉండగా, గంధం నారాయణరావు మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఉపాధ్యాయ వర్గాలు కూడా అభ్యర్థుల పక్షాన ప్రచారం నిర్వహించారు. గోపిమూర్తికి యూటీ ఎఫ్‌తో పాటు పలు సంఘాలు మద్దతు ఇవ్వగా, గంధం నారాయణరావుకు ఎస్టీయు, మరికొన్ని మద్దతు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోటీ నువ్వానేనా అన్నట్టుగా గడిచిన మూడు రోజులుగా మారిపోయింది. సీనియర్ అయిన తనకు ఒక అవకాశం ఇస్తే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని గంధం నారాయణరావు ప్రచారం చేయగా, షేక్ సాబ్జీ మరణానంతరం ఉపాధ్యాయుల హక్కులను కాపాడే సత్తా తమకే ఉందని, తాము బలపరిచే అభ్యర్థి గోపిమూర్తికి ఓటు వేయాలని యూటీఎఫ్ కోరుతుంది. వామపక్షాలు రెండు చెరోవైపు విడిపోయి వారం రోజుల్లో ప్రచారాన్ని హోరెత్తించాయి.



భీమవరంలో మద్యం దుకాణానికి సీల్

ఉదయం ఎనిమిది నుంచి పోలింగ్

ఈ ఎన్నికలల్లో 3వేల729 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 20 మండలాలకు సంబంధించి 20 పోలింగ్‌స్టేషన్‌లను ఏర్పాటుచేసారు. పోలింగ్ ను నిర్వహించేందుకు ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ ఆఫీసర్, మరో ముగ్గురు అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లను నియమించారు. వంద మందిని నియమించగా మరో 36 మందిని రిజర్వ్‌గా ఉంచారు. 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రత నడుమ కాకినాడకు తరలిస్తారు. 7వతేదిన కౌంటింగ్ నిర్వహిస్తారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులకు ఓటు వేసే విధానంలో ప్రాధాన్యత క్రమంలో ఓటు వెయ్యవసి ఉటుంది. అభ్యర్థులందరికి ఓటు వేసుకోవచ్చు. పోలింగ్ సందర్భంగా 3వ తేది సాయంత్రం 4 గంటలనుంచి జిల్లాలోని అన్ని మద్యం షాపులను మూసివేసారు. షాపులకు ఎక్సైజ్ అధికారులు సీజ్‌చేసారు. ఇప్పటికే జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ నాగరాణి అధికారులతో మాట్లాడారు. కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీస్ బందో బస్తును ఏర్పాటుచేస్తున్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

గణపవరం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలకు ఎటువంటి లోటు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. మంగళవారం గణపవరం బాలుర హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రంలో సదుపాయాలు, ఓటర్ల జాబితా, లైటింగ్ తదితర అంశాలను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి ఎమ్మెల్సీ ఎన్నికకు ఒక రూమ్, నీటి సంఘాల ఎంపికకు ఆరు రూమ్‌లను పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు.

ఓటేయడానికెళ్తే... స్కూలు నిర్వహణ ఎలా?!

నేడు స్పష్టత ఇవ్వనున్న డీఈవో

ఏలూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు గురువారం ఓటుహక్కు వినియోగంపై డైలమా నెలకొంది. హైస్కూళ్ళలో పదోతరగతి విద్యార్థుల కోసం ఎస్సీఈఆర్టీ ప్రకటించిన వంద రోజుల కార్యాచరణలో మార్చి పదోతేదీ వరకు ఆదివారాలతో సహా(సంక్రాంతి సెలవల్లో మూడు రోజులు మినహా) ప్రత్యేక తరగతుల నిర్వహణను ఇప్పటికే ప్రారంభించిన విషయం విదితమే. ఈ క్రమంలో తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ గురువారం జరుగనుంది. ఓటుహక్కువున్న టీచర్లకు ఆ రోజున స్పెషల్ క్యాజువల్ లీవును మంజూరుచేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడే సమస్య వచ్చిపడింది. హైస్కూలులో బోధించే స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లందరికీ దాదాపుగా ఓటుహక్కు ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌రోజున ఓటుహక్కు వినియోగించుకునేందుకు సంబంధిత టీచర్లందరూ స్పెషల్ సీఎల్‌ను వినియోగించుకుంటే స్కూలును లేదా వందరోజుల కార్యాచరణను నిర్వహించడం అసాధ్యమైనందున ఆ రోజున స్కూలు అంతటికీ వర్తించేలా స్థానిక సెలవు (ఎల్‌హెచ్)ను ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్‌గా ఉంది. ఒకవేళ ఓటు హక్కులేని ఒకరిద్దరు టీచర్లున్నా స్కూలును నిర్వహించడం సాధ్యంకాదని చెబుతున్నాయి. ఈ డైలమాపై డీఈవోను వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్ళి వారి నిర్ణయాన్ని బుధవారం ప్రకటిస్తామని వివరించారు. కాగా ఏలూరుజిల్లాలో మొత్తం 2667 మంది టీచర్ ఓటర్లున్నారు. ఈ సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారంగా స్కూలులో ఓటుహక్కువున్న మొత్తం టీచర్లలో ఉదయం, మధ్యాహ్నం చెరిసగం మందికి షిఫ్ట్ మాదిరిగా ఓటు వేసేందుకు వెసులుబాటు కల్పించి, స్కూలు మూసివేయకుండా చర్యలు చేపట్టడం లేదా స్థానికంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడే ప్రత్యేక తరగతుల నిర్వహణకు అడ్జస్ట్‌మెంట్ చేసుకునేలా సూచనలు చేసే విషయమై ప్రతిపాదనలు అధికారుల పరిశీలనలోవున్నట్టు తెలిసింది. అయితే దీనిపై మంగళవారం రాత్రి వరకు ఎటువంటి అధికారిక ప్రకటన లేదు.



ఆడపిల్లలు స్వశక్తితో ఎదగాలి: కలెక్టర్



గణపవరంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

గణపవరం/పెంటపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):ఆడపిల్లలు బాగా చదువుకుని స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం గణపవరం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని గదుల్లో పెచ్చులూడుతున్న స్లాబులుపై మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే ప్రాంగణంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి ఇబ్బందులపై ప్రశ్నించారు. పెంటపాడు మండలం పరిమెళ్ల సీపీడబ్ల్యుఎస్ పథకం పైపులైన్ల మరమ్మతు పనులను త్వరతగతిన పూర్తిచేసి స్వచ్ఛమైన తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. మంగళవారం పరిమెళ్ల లాకుల వద్ద నుంచి నీటిని ఎత్తిపోసే పంపింగ్ స్కీం పనితీరును కలెక్టర్ పరిశీలించారు. కాల్వగట్టుపై గుడిసెల్లో నివసిస్తున్న యానాది కుటుంబాలతో కలెక్టర్ మాట్లాడారు. అందరికి రేషన్, ఆధార్ కార్డులు ఉన్నాయా? పిల్లలు చదువుతున్నారా? అంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పరిమెళ్ల వసతి గృహంలో వసతులు, భోజన సదుపాయంపై విద్యార్థులను ఆరా తీశారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, సేవకులు

మావుళ్ళమ్మ హుండీ ఆదాయం 70.07 లక్షలు

భీమవరం టౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ హుండీ ఆదాయం మంగళవారం లెక్కించారు. మూడు నెలలకు గాను 70 లక్షల 07 వేల 033 రూపాయలు వచ్చిందని దేవస్థానం సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ తెలిపారు. దీంతోపాటు 133 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 880 గ్రాముల వెండి వచ్చిందన్నారు. విదేశీ కరెన్సీ కూడా లభించిందన్నారు. లక్షా 4 వేల 177 రూపాయిలు అన్నదానం నిమిత్తం వచ్చాయని వివరించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారన్నారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జునశర్మ, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో సోలార్ పవర్‌ప్లాంట్‌కు అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

సోలార్ పవర్ ప్లాంట్ స్థలం పరిశీలించిన జేసీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మోడల్ సోలార్ విలేజ్ ద్వారకాతిరుమలలో మొదటిసారిగా ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో పైలట్ సోలార్ ప్రాజెక్ట్ కింద 750 కెడబ్లూపి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని జేసీ ధాత్రిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ట్రాన్స్‌కో పర్యవేక్షక ఇంజనీర్ సాల్మన్‌రాజు,ఈఈ అంబేడ్కర్ ఆమెకు ప్లాంట్ వివరాలు తెలిపారు. అనంతరం పీఎం సూర్యఘర్ యోజన పథకంపై గృహ విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఈలు శశిధర్, గోపాలకృష్ణ సోలార్ వెండర్స్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె చిన వెంకన్నను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల నుంచి వేదాశీర్వచనం, ప్రసాదం పొందారు.



షష్ఠి ఉత్సవాలకు ముస్తాబు



అత్తిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :అత్తిలి గ్రామ ఇలవేల్పుగా గుర్తింపు పొందిన వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కళ్యాణం రంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.15 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వల్లి దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అత్తిలిలో ఏకశిలా షణ్ముఖిగా పూజలు అందుకుంటున్నారు. షష్ఠి తిరునాళ్ళు బుధవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. 15 రోజుల పాటు జరిగే షష్ఠి తిరునాళ్ళకోసం భారీ ఎత్తున చలువ పందిళ్ళు నిర్మించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనం కోసం ప్రత్యేకంగా లైన్లను ఏర్పాటు చేశారు. అత్తిలికి చెందిన కూనపరెడ్డి తేజ, విజయలక్ష్మి దంపతులు శుక్రవారం సాయంత్రం కల్యాణం జరుపుతారు. అనంతరం భక్తులు దర్శనాలకు అనుమతిస్తారు. శనివారం తీర్థ మహోత్సవం జరుగుతుంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అత్తిలి ఉన్నత పాఠశాల వద్ద అన్న సమారాధన నిమిత్తం పందిళ్ళు నిర్మించారు.ఉత్సవాల రోజుల్లో రోజూ వేలాది మందికి అన్న సమారాధన జరుపుతారు. శనివారం రాత్రి భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా 20 వరకు పెద్ద ఎత్తున నాటకాలు, బుర్రకథలు, సంగీత విభావరి, సినీ మ్యూజికల్ నైట్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు షష్ఠి కమిటీ ఛైర్మన్ కురెళ్ళ ఉమామహేశ్వరరావు తెలిపారు. షష్ఠి ఉత్స వాల సందర్భంగా ఎందరో కళాకారులను సత్కరిస్తుంటారు. స్వర్గీయ ఎస్వీ రంగారావును ఏనుగు అంబారీపై ఊరేగించడంతో పాటు ఘనంగా సన్మానించారు. రేలంగి, చిరంజీవి తదితర నటులు సత్కారం పొందారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి దాడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దిరిశాల మాధవరావు, కోశాధికారి ఇర్రి వెంకట సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. తణుకు సిఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో 250 మంది పోలీసులతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అత్తిలి ఎస్ఐ ప్రేమరాజు తెలిపారు.

కైకరం షష్ఠి ఉత్సవాలకు 90 సంవత్సరాలు



ఉంగుటూరు, డిసెంబరు 3: కైకరంలోని శ్రీ వల్లీదేవసేన సహిత శ్రీసుబ్రహ్మణ్య స్వామి వారి 90వ ఉత్సవాలు ఈనెల 6వ తేదీ రాత్రి స్వామివారి కళ్యాణంతో ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహక కమీటీ తెలిపింది.1935లో అద్దేపల్లి కొండయ్య సతీమణి సోమాయమ్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రతిష్ఠించి ప్రతియేటా ఉత్సవాలు నిర్వహించడం పరిపాటి. పిల్లలు పుట్టనివారు స్వామిని మొక్కుకుంటే పిల్లలు పుడతారని నమ్మకం.ఈ ఏడాది వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పడమరవిప్పర్రులో ..



పెంటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పడమర విప్పర్రు స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం షష్ఠి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. మంగళవారం ఆలయ అర్చకులు కొడవటిగంటి నర్సింహాచార్యులు, జనార్థనాచార్యుల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ పసల గంగా రామ చంద్రన్ (చంటి) మాట్లా డుతూ 6వ తేదీన ఆలయ ప్రాంగణం వద్ద స్వామివారికి కళ్యాణం, 7వ తేదీన షష్ఠి మహో త్సవాలు, సుమారు 40 వేల మందికి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీన ఆలయ ప్రాంగణంలోని కోనేరు వద్ద స్వామి వారికి ఘనంగా తెప్పోత్సవం జరుగు తుంద న్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజ రయ్యే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటు వంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. మాజీ ఎంఎల్ఏ పసల కనక సుందర్రావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పసల అచ్యుతం, పసల గంగన్న, సత్యనారాయ ణమూర్తి పాల్గొన్నారు.

ఎలా కొనాలి.. ఏం..తినాలి ?



నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యులు షాపులకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పెరుగుతున్న ధరలు సామాన్యులకు భారంగా మారాయి. అన్నిరకాల ధరలు పెరగడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ప్రజలున్నారు. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు, చికెన్, కోడిగుడ్లతో సహా అన్నిరకాల ధరలు రోజురోజుకి పెరుగుతూనే పోతున్నాయి. ఏం కొనాలి.. ఎలా తినాలనే పరిస్థితిలో సామాన్యుడు ఉన్నాడు..

నిత్యావసర ధరలన్నీ పైపైకి

సామాన్యులకు భారం

భయపెడుతున్న బియ్యం ధరలు

వంటనూనెలు సలసల

కంటతడి పెట్టిస్తున్న కూరగాయలు



ఏలూరు టూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బియ్యం ధరలు సామాన్యులకు భారంగా మారాయి. సోనామసూరి కేజీ రూ.65కు చేరుకుంది. పీఎల్ రూ.55 -65 వరకు అమ్ముతున్నారు. కందిపప్పు కేజీ రూ.180 అయ్యింది. మినపప్పు రూ.140, పెసరపప్పు రూ.140లకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో వంటనూనె ధరలు కేజీకి గత రెండు నెలల్లోనే రూ.30 పెరిగింది. వేరుశనగ నూనె కేజీ రూ.200, సన్‌ఫ్లవర్ రూ.180, నువ్వులనూనె రూ.480, రైస్‌రిచ్ ఆయిల్ రూ.170, కొబ్బరినూనె రూ.300కు చేరుకుంది. గత ఆరు నెలలతో పోలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు 20 నుంచి 40 శాతం వరకు పెరిగాయి. ఈ ధరలు సామా న్యులను తీవ్రంగా భయపెడు తున్నాయి. ధరలు తగ్గకపోయినా పర్వాలేదు.. స్థిరంగా ఉంటే చాలనే పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు.





కూరగాయల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు. ప్రతిరోజు వంటల్లో వాడే ఉల్లిపాయలు, టమోటా ధరలు మోత మోగిస్తున్నాయి. మూడు నెలల నుంచి ఉల్లిపాయలు కేజీ రూ.60 పైమాటే. ప్రతీ కూరలో వాడే టమోటాలు రూ.50కి చేరుకున్నాయి. వంకాయలు కేజీ రూ.50, బీరకాయలు రూ.60, క్యారెట్ రూ.70లకు ఎగబాకాయి. బెండ, దొండకాయలు, గోరుచిక్కుళ్ళు రూ.40 పైమాటే. ఎన్నడూ లేనంతగా దోసకాయలు, ఆనబకాయలు, పొట్లకాయలు, రూ. 30-40 పలుకుతున్నాయి. చిక్కుళ్ళు రూ.80కి ఎగబాకాయి. ఆకు కూరలు కట్ట రూ.20 తక్కువ లేదు. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో వచ్చిన వానలు, వరదలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గి ధరలు పెరిగిపోయాయి. కార్తీకమాసం రావడంతో మరింత పెరిగాయి.

కార్తీకమాసం ముగియగానే చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.240కి ఎగబాకింది. కోడిగుడ్లు ధరలు సాధారణంగా రూ.5 నుంచి రూ.7వరకు పెరిగింది. మటన్ రూ.900కు చేరుకుని సామాన్యుడికి అందుబాటులో లేదు. వెల్లుల్లి ఐదు నెలల క్రితం కేజీ రూ.150 ఉండగా ఇప్పుడు కిలో రూ.400 అమ్ముతున్నారు. ఇలా అన్ని రకాల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యుడు బతకలేని పరిస్థితి



అన్నిరకాల ధరలు విపరీతంగా పెరగటంతో ప్రజల బ్రతుకు ప్రశ్నార్థకమైంది. కొన్నిసార్లు అర్థకాలితోనే పడుకోవాల్సి వస్తుంది. కూరగాయల దగ్గర నుంచి ఉప్పులు, పప్పులు, బియ్యం, చింతపండు ఇలా ఒకటేమిటి సామాన్యులకు అందు బాటులో లేవు. అటు పంట పండించిన రైతు నష్టపోతున్నాడు. మరోపక్క వినియోగదారుడు భరించలేని స్థితిలో ధరలున్నాయి. దళారీ వ్యవస్థ కారణంగా ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. దళారీ వ్యవస్థను అరికట్టడమే కాకుండా ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-కే.నరసింహనాయుడు, ఏలూరు

సమాజానికి ఉపయోగపడే ప్రయోగాలు

తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్ జిల్లా టెక్ ఫెస్ట్

ఆకట్టుకున్న ప్రాజెక్టులు

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రారంభమైన అంతర్ జిల్లా టెక్‌ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.సాంకేతికతను ఉపయోగించు కుంటూ నేటి సమాజానికి అవసరమైన ప్రయో గాలను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 13 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 123 మంది విద్యార్థులు 48 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులకు మొదటి ద్వితీయ బహుమతులతో పాటు ఉత్తమ ప్రాజె క్టులను జనవరి 6,8 తేదీల్లో విజయవాడలో నిర్వ హించే రాష్ట్ర స్థాయి టెక్ ఫెస్ట్‌కు ఎంపిక చేస్తారని ప్రిన్సిపాల్ డి.ఫణీంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ ప్రదర్శనలో కొన్ని ప్రదర్శనలు ఇవీ..

నమూనా సబ్‌స్టేషన్



ప్రతీ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల్లో తగినంత సమాచారం ఉంటుంది. కానీ ఆ పుస్తకాల్లో కాకుండా ఫీల్డ్ విజిట్ చేస్తే కానీ అన్ని విషయాలు అర్థం కావు. ఓ సబ్ స్టేషన్‌లో ఉండే ప్రతీ అంశాన్ని వివరించే విధంగా తయారు చేసిన నమూనా సబ్‌స్టేషన్ ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్టును తణుకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఫణీంద్రప్రసాద్ నేతృత్వంలోని బృందం ప్రదర్శించారు.

సెన్సార్ పార్కింగ్



మనం తరచూ సినిమాహాల్స్, ఫంక్షన్ హాల్స్, షాపింగ్‌మాల్ ఇలా అన్నింటిలోనూ పార్కింగ్‌లో ఇబ్బంది పడుతుంటాం. అలాంటి ఇబ్బంది లేకుండా ఓ పార్కింగ్ ప్రాంతంలో ఎన్ని వాహనాలు ఉన్నాయి.. ఎన్ని పడతాయి.. అనే డిస్ప్లే బోర్డు పెట్టడం ద్వారా అక్కడ ఇబ్బంది లేకుండా చూసుకోవడంతో పాటు, ఆ పార్కింగ్ ప్రాంతంలో సెన్సార్ గేటు ఏర్పాటు ద్వారా ఇటు కార్లు,మోటారు సైకిల్స్ వాహనదారులు ఇబ్బంది లేకుండా ఉండేలా దీన్ని రూపొం దిం చారు.. నరసాపురం స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ విద్యార్థులు ఎలీజా బృందం రూపొందించిన ఈ ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుంది.

ఎనర్జీ రీచార్జిబుల్ సైకిల్

ప్రస్తుతం విద్యుత్తు మోటారు సైకిల్స్ కాలం నడుస్తోంది. ఈ సమయంలో ఈ వాహనాలకు చార్జింగ్ సమస్య తలెత్తుతోంది. అలాంటి సమస్య లేకుండా ఓ సైకిల్‌కు విద్యుత్తు బ్యాటరీ ద్వారా నడపడంతో పాటు ఆ సైకిల్ నడు స్తున్నంత సేపు బ్యాటరీ చార్జిచేసే విధంగా తయారు చేసిన సైకిల్ ఆకట్టుకుంది. ఈ సైకిల్‌ను భీమవరం విష్ణుపురానికి చెందిన శ్రీ సీతా పాలిటెక్నిక్ విద్యార్థులు రవిశంకర్, భవాణీ ప్రసాద్‌లు ప్రదర్శించారు.



పరిశ్రమలకు ఉపయోగపడేలా విద్యార్థులను తయారు చేయాలి

కలెక్టర్ నాగరాణి

రాష్ట్రంలోని పరిశ్రమలకు అనుగుణంగా విద్యా ర్థులను తీర్చిదిద్దే విధంగా పాలిటెక్నిక్ కళాశా లలు ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. టెక్ ఫెస్ట్‌వల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు కోర్సు పూర్తికాగానే ఇంజనీరింగ్‌కు మక్కువ చూపుతున్నారని ఉన్నత చదువుకోసం వెళ్లడం మంచిదేనని కానీ మన డిమాండ్‌కు తగ్గట్టుగా నడు చుకుంటే బాగుంటుందన్నారు.ఎక్కువ కంప్యూటర్ కోర్సులపై చూపే శ్రద్ధ మెకానికల్, సివిల్ విభాగాలకు ఉండటంలేదని ఆ శాఖల్లో నైపుణ్యం కలవారు తగ్గిపోతున్నా రన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆర్డీవో కౌసర్‌బిన్, కమిషనర్ ఏసుబాబు, ఆర్జేడీ సత్య నారాయణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.





లలితాశ్రీ పీఠంలో దీపార్చన

కామవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో మంగళవారం సామూహికంగా లక్ష్మీనారాయణ పూజ నిర్వహించి ఓంకార సహస్ర దీపార్చన నిర్వహించారు. స్వామివారికి, అమ్మవార్లకు భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు దుర్గబాబు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి ఓంకారం, శంకుచక్రాల రూపంలో దీపాలను వెలిగించారు. భక్తి సంకీర్తనలు ఆలపించారు.



ఘనంగా లక్ష తమలపాకుల పూజ

జీలుగుమిల్లి, డిసెంబరు, 3 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం లక్ష తమపాకుల పూజలు నిర్వహించారు. హన్‌మాన్ మండల దీక్ష చేపట్టిన స్వాములు పూజలు చేశారు. అర్చకులు కస్తూరి చిరంజీవిశర్మ స్వామి వారికి లక్ష తమలపాకులు పూజ చేశారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

సౌత్‌జోన్ పోటీలకు స్వర్ణాంధ్ర విద్యార్థులు ఎంపిక



నరసాపురం రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): త్వరలో చెన్నైలో జరిగే యూనివర్సిటీ సౌత్‌జోన్ టేబుల్ టెన్నిస్ పోటీలకు మండలంలోని స్వర్ణాంధ్ర విద్యార్థులు పాల్గొన్నారు. ఇటీవల జేఎన్‌టీయూ పరిధిలో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వ హించిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో కళాశాలకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. వీరు చెన్నైలో జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను మంగళవారం ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్, విశ్వనాథన్, పండరీనాథ్, పీడీ కొండలు అభినందించారు

మా ఊరికి దారేది..



పోలవరం గిరిజన గ్రామం

మెత్తప్పకోట వాసుల ఆవేదన

రోడ్డు మార్గం లేక అవస్థలు

కొండలు..గుట్టలు దాటి ప్రయాణం

ట్రాక్టర్లపై వారపుసంతకు వచ్చి సరుకులు కొనుగోలు..

పోలవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అది మారుమూల గిరిజన గ్రామం..పోలవరం మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో పాపికొండల అభయారణ్యంలో ఉంది. నిత్యావసరాలు కొనుక్కోవాలన్నా, ప్రాణాల మీదకొచ్చి అత్యవసర పరిస్థితులు ఎదురైనా గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలతో కొండకోనలు దాటి రాయి రప్పల్లో కిందా మీదా పడుతూ పోలవరం పరుగులెత్తాల్సిందే. ఒక్కో సందర్భాల్లో డోలీలు కట్టి లేదా మంచంతో సహా మోసుకొచ్చిన సందర్భాలు కూడా లేకపోలేదు. అదే మెత్తప్పకోట గ్రామం.. అభివృద్ధికి ఆమడ దూరంలో అడవుల్లో ఉంటూ ఇబ్బందుల పడుతున్న తమ గ్రామానికి ప్రతి ఎన్నికల్లో ప్రచారానికి ఓట్ల కోసం వచ్చిన నాయకులు రోడ్డు మార్గం వేయిస్తామని హామీ ఇచ్చి వెళ్ళారే గానీ ఒక్కరూ ఆచరణలో పెట్టడం లేదని గత ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సైతం రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చి ఉత్తచెయ్యి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ రోడ్డు మార్గంలేక అగచాట్లు పడుతూ ట్రాక్టర్‌పై ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం మండలం చేగొండపల్లి పంచాయతీకి చెందిన ఈ గ్రామంలో 144 కుటుంబాలు ఉంటున్నాయి. ఏ అవసరం వచ్చినా బైకుమీదో ట్రాక్టర్‌పై రాళ్ళలో కొండలపైకి ఎక్కి దిగి పోలవరం చేరుకోవాల్సిందే. ప్రతి మంగళవారం పోలవరంలో జరిగే వారపు సంతకు ఉదయాన్నే ట్రాక్టర్లపై సమూహంగా వచ్చి నిత్యావసరాలు, మంచినీటితో సహా కొను గోలు చేసుకుని తిరిగి సాయంత్రానికి గ్రామం చేరుకుంటారు. అయితే ట్రాక్టర్‌పై రాకపోకలు సాగించే సందర్భంలో గతంలో 8 సార్లు ట్రాక్టరు తిరగబడి ప్రమాదాలు జరిగాయి. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో కొందరు మృత్యువు పాల య్యారని గ్రామస్థులు చెబుతున్నారు. 2016 సంవత్సరంలో ట్రాక్టర్ కొండల్లో తిరగబడి ఇదే గ్రామానికి చెందిన కొవ్వాసి రామయ్య అనే గిరిజనుడు మృతిచెందాడు. గతంలో అధికా రులు ఆ మార్గంలో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు మార్గం పనులు తూతూ మంత్రంగా చేసి సొమ్ములు చేసుకున్నారే గానీ పూర్తిస్థాయిలో రోడ్డు మార్గం ఏర్పాటు చేయలేక పోయారని గ్రామస్థులు చెబుతున్నారు. చేగొండపల్లి పంచాయతీకి ఎలాంటి అవసరాల్లోనైనా ఈ గ్రామస్థులు వెళ్ళాలంటే 10 కిలోమీటర్లు కొండల్లో ప్రయాణించి వింజరం చేరుకుని అక్కడి నుంచి మరో 8 కిలోమీటర్లు పోలవరం చేరుకుని అక్కడి నుంచి బస్సుల్లో ఆటోల్లో మరో 15 కిలోమీటర్లు ప్రయాణం చేయవలసిన పరిస్థితి. విద్యార్థులైతే పోలవరం పరి సర గ్రామాల్లో ఇల్లు అద్దెకు తీసుకోవడం లేదా బంధువల ఇంట ఉండి చదవడం చేస్తుంటారు. దీనికి తోడు ప్రతి నెలా రేషన్ తీసుకోవాలన్నా, వింజరం ఆసుపత్రికి వెళ్ళాలన్నా, ఆ గ్రామం నుంచి రాకపోకలు సాగించడానికి 20 కిలో మీటర్లు కొండకోనల్లో ప్రయాణించాల్సిందే. అధికారులు,నాయకులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు మార్గం వేయాలి



గ్రామస్థుడు మా గ్రామానికి రోడ్డు మార్గం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాం. గత ప్రభుత్వ పాలకుల నిర్వాకం వల్ల రోడ్డు మార్గం లేకుండా పోయింది. రోడ్డు కోసం నిధులు ఖర్చు చేశామని చెప్పుకుంటున్న నాయకులు రోడ్డు మార్గం ఎక్కడ వేశారో చెప్పలేకపోతున్నారు. అటవీశాఖ అధికారులు తమ గ్రామానికి రోడ్డు మార్గం విషయంలో అభ్యంతరాలు చెబుతున్నారు. మా గ్రామానికి రోడ్డు మార్గం వేయాలి.

మూలెం రాంబాబు, మెత్తప్పకోట

చాలా ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు మార్గం లేక పండించిన పంటలు తరలించడానికి, వైద్య సదుపాయాలు, నిత్యావసరాలు, మంచినీరు, ఇతర అవసరాలకు ఇబ్బం దులు పడుతున్నాం. చిన్న పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు వైద్య సదుపాయాలు కల్పించ డానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులకు గురవు తున్నాం. రోడ్డు మార్గం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలి.

మిడియం కన్నపరాజు, మెత్తప్పకోట

ఆళ్ల నానీ.. ఆగండి

- సీఎంతో చర్చలు వాయిదా.. ఏలూరులో తీవ్ర వ్యతిరేకతే కారణం
- అందుబాటులోకి ఎంపీ మహేశ్‌, జిల్లా అధ్యక్షుడు గన్ని
- ఉండవల్లి వైపు చూడని సిట్టింగ్‌ ఎమ్మెల్యే చంటి.. 9కి వాయిదా



మాజీ మంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరే ముహూర్తం వాయిదా పడింది. ఏలూరు నియోజకవర్గంలో ఆయనకు వ్యతిరేకంగా ప్రకంపనలు చెలరేగడంతో టీడీపీ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తొలుత రాష్ట్ర మంత్రివర్గం సమావేశం పూర్తయిన తర్వాత మంగళవారం ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో ఆళ్ల నానితోపాటు మిగతా ఎమ్మెల్యేలు కలవాల్సి ఉంది. కొంత చర్చలు జరిగిన తరువాత నానిని నేరుగా పార్టీలో చేర్చుకుంటారా, లేదంటే కొంత గడువు ఇచ్చి భారీ బలగం మధ్య ఆయన ప్రవేశం ఉంటుందా అనే దానిపై తర్జనభర్జన జరిగింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఆళ్ల నాని వ్యవహారంలో సోమవారం నుంచే ఒకింత గందరగోళం ఏర్పడింది. ఆయన టీడీపీలోకి రానున్నారని పార్టీ సంకేతాలు పంపగా, ఆ వెంటనే ఏలూరులో టీడీపీ కేడర్‌ సీరియస్‌గా స్పందించింది. గడిచిన ఐదేళ్లల్లో పార్టీ నేతల ఆస్తులు ధ్వంసం, అక్రమ కేసుల నమోదు, వ్యక్తిగత దాడులను ప్రోత్సహించిన నానిని పార్టీలోకి చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని తీవ్ర స్థాయిలోనే సీనియర్లంతా బహిరంగంగా వ్యాఖ్యలకు దిగారు. సిట్టింగ్‌ ఎమ్మెల్యే బడేటి చంటితోను ఈ అంశంపై మాట్లాడేందుకు ప్రయత్నించారు. పార్టీ కేడర్‌లో అత్యధికులు నాని రాకను వ్యతిరేకిస్తున్నందున తాము దానిని అంగీకరించాల్సి వస్తుందన్న అభిప్రాయాన్ని అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈలోపే గడిచిన ఐదేళ్లపాటు టీడీపీకి వ్యతిరేకంగా సాగిన దురాగతాలను సోషల్‌ మీడియాలో హోరెత్తించారు. తమను కాదని పార్టీలోకి వస్తే మీకు అవమానాలే అంటూ నానినుద్దేశించి అనేకమంది కామెంట్లు పెట్టారు.

జిల్లాలో పార్టీ ఎమ్మెల్యేలతోపాటు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌ యాదవ్‌తో సహా అందరూ మంగళవారం అందుబాటులో ఉండాలని సోమవారం రాత్రి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం పార్టీ ఆదేశాల మేరకు ఢిల్లీలో ఉన్న ఎంపీ మహేష్‌తోపాటు గన్ని ఉండవల్లికి చేరుకున్నారు. నియోజకవర్గంలో వెల్లువెత్తిన వ్యతిరేకతను ముందు అధినాయకత్వం దృష్టికి తీసుకు రావాలని వీరు సంకల్పించారు.

ఎందుకింత వ్యతిరేకత ?

జగన్‌ పాలనలో మిగతా నియోజకవర్గాల మాదిరిగానే ఏలూరులో అనేక సంఘటనలు తెలుగుదేశంకు వ్యతిరేకంగా చోటు చేసుకున్నాయి. టీడీపీలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న నేతలను టార్గెట్‌గా చేసుకుని వారి వ్యాపార సముదాయాలను ధ్వంసం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మించారనే సాకుతో కూల్చివేశారు. దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపైనా పోలీసులు బెదిరింపు ధోరణికి పాల్పడ్డారు. దీనికితోడు నాని వరుసగా ఎన్నికల్లో పోటీ చేయడం, ఆయన వెంటే కేడర్‌ కొనసాగుతుండడంతో ఆయన నిర్ణయమే ఏకపక్షమైంది. ఈ తరుణంలో గత ఎన్నికల్లో తనకు తిరుగులేదనుకున్న నానికి చేదు అనుభవం ఎదురైంది. భారీ ఓటమిని మూటకట్టుకున్నారు. నియోజకవర్గ ఓటర్లు అత్యధికులు ఆయన పట్ల వ్యతిరేకత ప్రదర్శించినట్లయ్యింది.

నేడు పార్టీ కార్యాలయానికి చంటి

పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించే వినతుల స్వీకరణలో పాల్గొనేందుకు సిట్టింగ్‌ ఎమ్మెల్యే చంటికి బుధవారం అవకాశం దక్కింది. ఇదే తరుణంలో సీఎం చంద్రబాబు వినతుల స్వీకరణలో పాలుపంచుకోబోతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సీఎం మధ్య కొంత సంభాషణ జరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని భావిస్తున్నారు. ఎమ్మెల్యే కూడా ఉన్న పరిస్థితులను ఆయనకు వివరించనున్నారు. ఈ నెల 9న ఆళ్ల నాని రాకకు దాదాపు ముహూర్తం ఖరారు చేయడంతో ఈ పరిణామాలు ఎలా ఎదుర్కోవాలని నియోజకవర్గంలో టీడీపీ నేతలంతా తర్జనభర్జనలు పడుతున్నారు.

ఎమ్మెల్యే ఏం చేయబోతున్నారు ?

తాజా పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే బడేటి చంటి నిర్ణయాన్ని పార్టీ నాయకత్వం పరిశీలనలోకి తీసుకోబోతుంది. ఈ నెల 9న నాని పార్టీలో చేరే విషయంలో నిర్దిష్ట అభిప్రాయానికి రానున్నారు. ఈలోపే నియోజకవర్గంలో చెలరేగిన అసంతృప్తిని ఏ రూపంలో పార్టీ అంచనా వేస్తుందనేది అందరి ప్రశ్న. ఈ తరుణంలోనే ఎమ్మెల్యేపై పార్టీ కేడరంతా పూర్తి బాధ్యతలను అప్పగించింది. మేమైతే నానిని పార్టీలోకి తీసుకుంటే బాగుండదని చెబుతున్నాం. వైసీపీ హయాంలో నష్టకష్టాలను అనుభవించాం. మళ్ళీ వాళ్ళనే పార్టీలోకి తీసుకోవాలా, వద్దా అనే తుది నిర్ణయానికి రండి అంటూ ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచారు. దీంతో మంగళవారం పార్టీ నుంచి పిలుపు వచ్చినా చంటి ఆ వైపు చూడనేలేదు. ఏదైనా నిర్ణయం తీసుకుంటే మీ ఇష్టం, ఇక్కడ అత్యధికులు నాని రాకను వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్యే పార్టీకి చేరవేశారు. దీంతో మంత్రివర్గ సమావేశం పూర్తయిన వెంటనే పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యులతో సీఎం చంద్రబాబు భేటీ కావాలనుకున్నా ఆఖరు నిమిషంలో వాయిదా వేసుకున్నారు. ఏలూరు ఎమ్మెల్యే వచ్చారా, రాలేదా అని టీడీపీ పెద్దలు ఆరా తీశారు. అప్పటికే ఎంపీ మహేష్‌యాదవ్‌, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని మాత్రమే అందుబాటులోకి వచ్చారనే విషయం పార్టీకి చేరింది. అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే రాకుంటే ఇక మాట్లాడేదెలా అంటూ ఈ నెల 9న తేలుద్దామని ప్రస్తుత భేటీని వాయిదా వేసుకున్నారు. నాని పార్టీలో చేరే వ్యవహారం మంగళవారం తేలిపోతుందని భావించినా దీనికి విరుద్ధమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ఆళ్ల నాని స్థానికంగా అంత బలవంతుడైతే తమకు ఎవరికీ అభ్యంతరంలేదని, కేవలం అవకాశం కోసమే పార్టీలోకి వస్తున్నారనే అభిప్రాయాన్ని నియోజకవర్గమంతటా వినిపించింది. ఈ విషయంలో ఉండవల్లికి రావాల్సిందిగా ఎమ్మెల్యే చంటిని పదేపదే కోరినా ఫలితం లేకపోయింది.



అవినీతికి పాల్పడితే జైలే

- ఉపాధి విజిలెన్సు విభాగానికి జవసత్వాలు
- జీవో 52 మరింత కఠినం

'ఉపాధి'లో అక్రమాలకు చెక్‌ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం జీవో నంబర్‌ 52కు పదును పెట్టాలని నిర్ణయించింది. ఈ పథకంలో అక్రమాలు నిరోధించే విజిలెన్సు విభాగాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అయితే ఆ విభాగాన్ని పటిష్ఠం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ స్టేట్‌ విజిలెన్స్‌ ఆఫీసర్‌గా వివిధ విభాగాలకు చెందిన ఆఫీసర్లను కాకుండా పోలీసు అధికారులను నియమించడంతో ఈ పథకం ద్వారా జేబులు నింపుకుంటున్న నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

అత్తిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తగా విజిలెన్సు విభాగం అధికారిగా బాధ్యతలు తీసుకున్న చీఫ్‌ విజిలెన్సు అధికారి భవానీ హర్ష విజిలెన్స్‌ విభాగం అసలు లక్ష్యాలను సాధించేందుకు ఆయన జిల్లాలోని 'ఉపాధి'లో జరుగుతున్న పనుల వివరాలపై నివేదిక అందించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఉపాధి పనులపై ఇప్పటి వరకు సోషల్‌ ఆడిట్‌ విభాగం తనిఖీలు చేసి రికవరీ చేసే అతి స్వల్ప పాత్రను పోషిస్తోంది. అయితే విజిలెన్స్‌ విభాగం సోషల్‌ ఆడిట్‌ను ఆషామాషీగా తీసుకోకుండా దుర్వినియోగం అయిన ప్రతి రూపాయిని అక్రమార్కుల నుంచి వసూలు చేసేందుకు విజిలెన్సు విభాగం ముందుకు వెళ్ళే అవకాశం ఉంది. జీవో నంబర్‌ 52 ప్రకారం ఉపాధి పథకంలో లక్ష కంటే ఎక్కువ మొత్తంలో అవినీతికి పాల్పడినట్లు సోషల్‌ ఆడిట్‌లో నిర్ధారణ అయితే విచారణ చేయాలని డ్వామా అధికార వర్గాలు తెలిపాయి. ఆ జీవోను ఇప్పటి వరకూ తూతూ మంత్రంగా అమలు చేశారు. కొత్త చీఫ్‌ విజిలెన్సు అధికారి ఈ జీవోలోని నిబంధనలపై దృష్టి పెట్టినట్లు జిల్లా అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకూ ఆయా జిల్లాల్లో ఎంత మంది లక్ష కంటే ఎక్కువగా అవినీతికి పాల్పడినట్లు సోషల్‌ ఆడిట్‌ అధికారులు నిర్ధారించారో తెలుసుకుని వారిపై కేసులు నమోదు చేశారా, చేయకపోతే ఎందుకు చేయలేదు అనే వివరాలను అందించాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతోపాటు అక్రమాలకు పాల్పడిన వారిపై ఆధార్‌ యాక్టు ఎన్ని చోట్ల వినియోగించారు? పరారీలో ఉన్న అక్రమార్కుల వివరాలు.. అక్రమాలకు పాల్పడడంతో తొలగించిన సిబ్బంది వివరాలను పంపించాలని కోరినట్లు తెలిసింది. దీంతో తప్పు చేసిన వారి గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. ఆడిట్‌లో తేలిన తప్పులపై మూడు రోజుల్లోపు చర్యలు తీసుకోవాలని జీవో నంబర్‌ 52లో స్పష్టంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్‌ ప్రొసీడింగ్‌ తప్పనిసరిగా అమలు చేసేందుకు జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు. విజిలెన్స్‌ విభాగాన్ని కఠినతరం చేస్తే ఇకపై ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన వారు జైలుకు వెళ్ళక తప్పదేమోనన్న భయం ఆ విభాగంలో పని చేస్తున్న వారిలో కనిపిస్తోంది.

పరిశోధనలు పేటెంట్ల స్థాయికి ఎదగాలి



శ్రీనివాస్‌ మద్దిపాటి

తాడేపల్లిగూడెం అర్బన్‌, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి ఉపయోగపడేలా నాణ్యమైన ప్రాజెక్టులు చేపట్టాలని ఇవా ఐపీ అండ్‌ ఐటీ ప్రైవేట్‌ లిమిటెడ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ శ్రీనివాస్‌ మద్దిపాటి అన్నారు. ఏపీ నిట్‌ ఇన్‌చార్జి డైరెక్టర్‌ డాక్టర్‌ ఎన్‌వీ రమణారావు, రిజిస్ట్రార్‌ డాక్టర్‌ పి. దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషన్‌ ఇన్నోవేషన్‌ కౌన్సిల్‌ సహకారంతో మేధోసంపత్తి హక్కులు-ఆవిష్కరణల పేటెంట్‌ అనే అంశంపై మంగళవారం ఏపీ నిట్‌లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ ప్రతి ఆవిష్కర్త కేవలం పరిశోధనా పత్రాలకే పరిమితం కాకుండా తమ పరిశోధనలు పేటెంట్‌లుగా మలుచుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. పేటెంట్‌ అనేది ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసే హక్కు అని, ఆవిష్కర్తలు తమ పరిశోధన లో ఏదో ఒక కొత్త విషయాన్ని చెప్పడం తో పాటు సంబంధిత రంగంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో ఆధారాలతో సహా రూపించాలన్నారు. ఇనిస్టిట్యూషన్‌ ఇన్నోవేషన్‌ కౌన్సిల్‌ అధ్యక్షుడు, ఆచార్యులు డాక్టర్‌ పెద్దపాటి శంకర్‌, ఉపాధ్యక్షురాలు డాక్టర్‌ వి.సుదర్శన దీప మాట్లాడారు. డీన్‌ రీసెర్చ్‌ అండ్‌ కన్సల్టెన్సీ డాక్టర్‌ జీఆర్‌కే శాస్త్రి అధ్యక్షత వహించగా ఆచార్యులు డాక్టర్‌ ఫణికృష్ణ కర్రి, డాక్టర్‌ కార్తికేయ శర్మ కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

సంక్రాంతికి ముందే సై

- జిల్లాలో జూదాల జాతర
- రోజుకో మండలాన్ని మారుస్తూ
- లక్షల్లో జూదాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు



సంక్రాంతి పండుగ ఇంకా 40 రోజులు ఉండగానే జిల్లాలో జూదాల జాతర మొదలైంది. పేకాట, కోడి పందాలతో పందెంరాయుళ్ళు మంచి జోష్‌ మీద ఉన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేకాట, కోడిపందాలు జోరుగా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో రాత్రివేళల్లో ఫ్లడ్‌ లైట్ల వెల్తురులో కాంతుల్లో భారీగా పందేలు సాగుతున్నాయి. దీంతో లక్షలు చేతులు మారుతున్నాయి.

భీమవరం క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొందరు దూర ప్రాంతాల నుంచి వచ్చి నాయకులు అనుమతితో జూదం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం. అలాగే అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకు భారీ ముడుపులు ఇచ్చి ఇలా జూదాలు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం చట్టుపక్కల ప్రాంతమైన ఒక గ్రామ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రాత్రి 11 గంటల సమయంలో వందల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు అక్కడకు చేరుకున్నాయి. ఫ్లడ్‌ లైట్లు కూడా రెడీ చేశారు. అయితే ఒక పోలీసు అధికారి నిలుపుదల చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడంతో కోడిపందేలు నిలిపివేశారు. అయితే ఆ సమయంలో ఆ గ్రామ పరిధి అంతా వాహనాలతో నిండిపోయింది. గ్రామ ప్రజలకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. అలాగే భీమవరం మండలంలోని ఒక గ్రామంలోని విల్లాస్‌లో నిత్యం పేకాట జరుగుతోందనే ప్రచారం జరుగుతోంది. పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అనేక వదంతులు వినిపిస్తున్నాయి.

వేరే ప్రాంతం నుంచి నిర్వాహకుడి రాక?

జిల్లాలోని కాళ్ళ మండల పరిధికి చెందిన ఒక వ్యక్తి కొన్నేళ్ళ క్రితం విశాఖ వెళ్ళి స్థిరపడ్డాడు. ఆ వ్యక్తి జిల్లాకు వచ్చి జూదాల నిర్వహణకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్కసారి ఒక్కో మండల పరిధిని ఎంచుకుని జూదగాళ్ళకు సమాచారం ఇవ్వడం, రెండు గంటల ముందుగానే సమాచారం అందుకున్న జూదగాళ్ళు అక్కడికి చేరిపోతున్నారు. దీంతో రాత్రి 3 గంటల వరకు జూదం నిర్వహించడం సర్వసాధారణమైపోయింది. అయితే ఆ వ్యక్తి కొందరు పోలీసు అధికారులకు భారీగా ముడుపులు అప్పచెప్పడం వల్లే పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా జూదానికి 'పశ్చిమ' పేరుగాంచింది అన్న విషయం మళ్ళీ రుజువవుతోంది.

కోడిపందేల శిబిరంపై దాడి 20 మంది అరెస్టు

కొయ్యలగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోడి పందేల శిబిరంపై దాడి చేసి 20 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మండలంలోని గవరవరం గ్రామంలో సోమవారం రాత్రి కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో రూ. లక్షా 23,130 నగదు, ఐదు మోటర్‌ సైకిళ్ళు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో ఎవరైన ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్‌ఐ హెచ్చరించారు.

కత్తితో దాడి..

టి.నరసాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడు గుమ్మళ్ళ స్వామిపై కేసు నమోదు అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం. జయబాబు మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలం లోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన నత్తా నాగరాజుకు, అదే గ్రామానికి చెందిన గుమ్మళ్ళ స్వామికి గత కొంతకాలంగా ఇంటి స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల రెండున నాగరాజు స్థానిక సచివాలయం వద్దకు వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తుండగా గుమ్మళ్ళ స్వామి ఇంటి సమీపంలోకి వచ్చేసరికి నాగరాజును స్వామి బూతులు తిడుతూ నా యింటి దగ్గర చేతబడి చేయిస్తావా అంటూ తన వద్ద ఉన్న కత్తితో నాగరాజు తలపై దాడి చేశాడని ఇంతలో నిందితుడి తమ్ముడి కొడుకు అడ్డుపడి కత్తి లాక్కున్నాడని తెలిపారు. బాధితుడు నాగరాజు తలకు బలమైన గాయం కావ డంతో అతని బంధువులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య నత్తా సుజానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు గుమ్మళ్ళ స్వామిని అరెస్టు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరచామని ఎస్సై తెలిపారు.

వాహన తనిఖీలు

రూ. 1.49 కోట్ల జరిమానా

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖ అధికారులు నవంబరు నెలలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 3,319 వాహనాలపై కేసులు నమోదు చేసి కోటి 49 లక్షల రూపాయలను అపరాధ రుసుముగా విధించినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్‌ షేక్‌ కరీమ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ప్రత్యేకించి 943 హెల్మెట్‌ ధరించని కేసులని, లైసెన్సులేని 529 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

వైసీపీ ఇన్‌చార్జి కొట్టును మార్చకుంటే పార్టీకి రాం రాం

తాడేపల్లిగూడెం రూరల్‌, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్‌ కొట్టు సత్యనారాయణను మార్చకపోతే తాము పార్టీకి రాజీనామా చేసేందుకు వెనుకాడబోమని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలోని ఓ హోటల్‌లో మంగళవారం సమావేశమయ్యారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు జడ్పీటీసీలు ముత్యాల ఆంజనేయులు, ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీపీ పి.శేషులత, పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు నాయకత్వం వహించారు. నాయకులు మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన తమను వేధించారని, అయినా పార్టీ కోసం పనిచేశామని చివరికి గుర్తింపు లేకుండా మాజీ మంత్రి వ్యవహరించారని ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో నాయకత్వ మార్పు చేస్తే తాము పార్టీలో కొనసాగుతామని లేదంటే పార్టీని వీడటానికి వెనకాడమని హెచ్చరించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు ధిక్కార స్వరం వినిపించారు.

రైల్లోంచి తోసేశారు !

మాజీ సర్పంచ్‌పై దొంగల దాడి



నరసాపురం రూరల్‌, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం సీతారాంపురం మాజీ సర్పంచ్‌ అడబాల అయ్యప్ప నాయుడుపై రైలులో దొంగలు దాడిచేశారు. వెళుతున్న రైల్లోంచి తోసివేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన రైల్వే పోలీసుల సాయంతో ప్రాణాలతో బయటపడ్డారు. నాయుడు తెలిపిన వివరాలివి.. శుక్రవారం హైదరాబాద్‌ నుంచి నరసాపురానికి నాగర్‌సోల్‌ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. టాయిలెట్‌కు వెళ్లేందుకు బోగీలోంచి బయటకు రాగా.. ఆ సమయంలో రైలు స్లో అయింది. ఇద్దరు వ్యక్తులు లోపలికి రావడాన్ని గుర్తించి బోగీలోకి ఎందుకు వెళుతున్నారని ప్రశ్నించా. వారు సమాధానం చెప్పకుండా తలుపు తీసి కదులుతున్న రైల్లోంచి నన్ను బయటకు నెట్టేశారు. తీవ్రంగా గాయపడి పట్టాల పక్కన పడ్డా. మరో రైలు వస్తుండటంతో ప్రమాదాన్ని గుర్తించి పక్కకు జరిగా.. రైల్వే పోలీసులు వచ్చి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అక్కడ కోలుకుని మంగళవారం గాయాలతో స్వగ్రామం చేరుకున్నా. ఆ ఘటన తలుచుకుంటే ఇంకా భయంగా ఉంది. ప్రాణాలతో బయటపడతానని అనుకోలేదని తనను పలకరించేందుకు వస్తున్న స్నేహితుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.



దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

నరసాపురం రూరల్‌, డిసెంబరు 3 (ఆన్‌లైన్‌): మండలంలోని సీతారాంపురం చెక్‌పోస్టు వద్ద ఈ ఏడాది ఆగస్టులో దారి దోపిడీకి పాల్పడిన ముగ్గుర్ని మొగల్తూరు పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం నరసాపురం రూరల్‌ సర్కిల్‌ కార్యాలయంలో సీఐ దుర్గా ప్రసాద్‌ విలేకర్లకు వివరాలు వెల్లడించారు. మొగల్తూరు మండలానికి చెందిన ఎం. దుర్గారావు బైక్‌పై పాలకొల్లు వెళుతూ సీతారాంపురం చెక్‌పోస్టు వద్ద ఆగాడు. ఆ సమయంలో అక్కడ నక్కి ఉన్న కేసవరపు వీర వెంకట సత్య విఘ్నేష్‌, రాయడు రాజు, తలపల అశోక్‌ అలియాస్‌ నిత్య రోజి (ట్రాన్స్‌ జెండర్‌) దుర్గారావుపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ. 22 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్‌ లాక్కొని పారిపోగా బాధితుడు మొగల్తూరు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం అప్పటి నుంచి గాలిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో నిందితులు మొగల్తూరు వెళ్లే దారిలోని రాజుగారితోట వద్ద ఉన్నారన్న పక్కా సమాచారంతో ఎస్సైలు జి. వాసు, వై. నాగలక్ష్మి సిబ్బందితో వెళ్లి నిందితుల్ని అరెస్టు చేసి వారి నుంచి సెల్‌ఫోన్‌ స్వాధీనం చేసుకుని, నేరానికి ఉపయోగించిన బైక్‌ను సీజ్‌ చేశామని సీఐ తెలిపారు. నిందితులు ముగ్గురూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారిగా విచారణలో తేలిందన్నారు. ఎస్సైలు జి. వాసు, వై. నాగలక్ష్మి, ఏఎస్సై సీహెచ్‌ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు రాజేష్‌, బేబి పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు ధర్నా

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన ఒక యువతి (24)ని ఏలూరు సత్యనారాయణపేటకు చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి షేక్‌ షాజహాన్‌ (29) పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని పెళ్ళి చేసుకుంటానని నమ్మ బలికాడు. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా శారీరక సంబంధం కొనసాగించాడు. అయితే మరో యువతిని పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడడంతో అది తెలుసుకున్న బాధితురాలు మంగళవారం ప్రియుడి ఇంటి ముందు ధర్నా చేపట్టింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్‌ సీఐ జి. సత్యనారాయణ, ఎస్‌ఐ మదీనా బాషా సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్ళి బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేధింపుల భర్తకు ఏడాది జైలు

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు త్రీ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని రెడ్డి చంద్రప్రియకు సాయి సత్య రాఘవేంద్రరావుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదని అదనపు కట్నం తీసుకురావాలని చంద్రప్రియను భర్త రాఘవేంద్రరావు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేశాడు. దీంతో బాధితురాలు 2022 మార్చి 11న ఏలూరు త్రీ టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఏఎస్‌ఐ కె గోవిందరాజు కేసు నమోదు చేయగా అప్పటి ఎస్‌ఐ శంకర్‌ కేసు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీటు ధాఖలు చేశారు. ఈ కేసు స్పెషల్‌ జ్యుడిషియల్‌ మొబైల్‌ కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన రాఘవేంద్రరావుపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్‌ ఎండి అబుతాలీబ్‌ పర్వేజ్‌ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ తరఫున ఏపీపీ పి. హేమలత వాదించగా ప్రాసిక్యూషన్‌కు ఎస్‌ కోటేశ్వరరావు, కోర్టు కానిస్టేబుళ్ళు సహకరించారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

కలిదిండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేట కలిదిండి దేవుడు తోటలో నివాసం ఉంటున్న బోయిన రమేష్‌ (40) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యతో విడిపోయిన రమేష్‌ ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం తల్లి ఇంట్లోకి వెళ్లేసరికి రమేష్‌ ఫ్యాన్‌కి ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. తండ్రి చిన్న వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్రైమ్‌ కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

పెనుగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోటారు సైక్లిస్టును కారు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ కె. గంగాధరరావు తెలిపారు. పాలకొల్లు మండలం దగ్గులూరుకు చెందిన దొడ్డి నాగరాజు (34) రాజమండ్రిలోని ఒక రైస్‌ మిల్లులో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దగ్గులూరు నుంచి డ్యూటీకి వెళ్లే సమయంలో పెనుగొండ-మార్టేరు రోడ్డులో శ్రీ వాసవి ఫ్లయాష్‌ బ్రిక్స్‌ వద్ద ఎదురుగా పెనుగొండ నుంచి మార్టేరు వైపు వెళుతున్న కారు నాగరాజు మోటారు సైకిల్‌ను ఢీ కొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగరాజు భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి రైతు బలి

ఆకివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):పశువులకు గడ్డి కోయడానికి వెళ్ళి విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. కుప్పనపూడి శివారు శివదేవ పార్వతీపురానికి చెందిన మధుం వెంకటేశ్వరరావు(45) అనే రైతు పశువులకు గడ్డి కోయడానికి మంగళవారం పొలం వెళ్ళాడు. గడ్డి కోస్తుండగా కరంటు వైర్లు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి భార్య నాగ ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు హనుమంతు నాగరాజు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో...

ఏలూరు క్రైం: చెరువు గట్టుపై కాపలాగా ఉన్న ఒక వ్యక్తి ఇంట్లో ఫ్యాను వైర్లను బిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ సరఫరా జరిగి షాక్‌కు గురై మృతి చెందాడు. ఏలూరు రూరల్‌ మండలం శ్రీపర్రుకు చెందిన జయమంగళ మంగరాజు(29) అదే గ్రామంలోని ఒక రైతు చేపల చెరువుకు కాపలాగా ఉంటూ చెరువుగట్టుపై తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు విద్యుత్‌ వైరు ఊడడంతో దానిని బిగిస్తున్నాడు. అయితే ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్‌ ఎస్‌ఐ సీహెచ్‌ దుర్గాప్రసాద్‌ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మృతుడి గుర్తింపు

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్‌ మండలం కొమడవోలు శివారు ఇందిరమ్మ కాలనీ సమీపాన వరి చేలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని ఏలూరు రూరల్‌ పోలీసులు ఈ నెల 2వ తేదీన కనుగొన్నారు. పత్రికల్లో సమాచారం రావడంతో బంధువులు మృతుడిని గుర్తించారు. పెదపాడు మండలం సత్యవోలు పంచాయతీ సకల కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆబోతుల సూరిబాబు (40)కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉండగా గతంలో కైకలూరులో ఉండేవారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సూరిబాబు ఏడాది క్రితం సకలకొత్తపల్లిలో తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటున్నాడు. అతని భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. సూరిబాబుకు మానసిక స్థితి సరిగా లేనందున వైద్యులకు చూపించగా మెరుగైన చికిత్స నిమిత్తం మానసిక వైద్య నిపుణుల వద్దకు వెళ్ళాలని సూచించారు. గత నెల 24న సూరిబాబు సోదరి అతనిని వైద్యులకు చూపించి బ్యాంకు పని ఉండగా మార్గమధ్యంలో ఆగారు. అతను అక్కడ నుంచి వెళ్ళిపోయి తిరిగి రాలేదు. మానసిక స్థితి సరిగా లేక ఆహారం తినక నీరసించి వరిచేలో పడిపోయి ఉంటాడని ప్రాథమికంగా భావించారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తణుకులో అన్నక్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

నాణ్యమైన భోజనమే లక్ష్యం : ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు నాణ్యతగా అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం సొసైటీ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌లో వంటకాలను, భోజనాలు చేసే వారితో మాట్లాడి పలు విషయాలను తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో పేద, బడుగు వర్గాలు, ఇతర ప్రాంతాల నుంచి తణుకు వచ్చి హోటల్‌లో తినలేని వారికి ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రతిరోజు క్యాంటీన్‌లో 1500మంది మూడు పూటలు తింటున్నారని వివరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

శ్రీవాసవవీ జ్యోతి మానేపల్లి నారాయణ మూర్తి మెమోరియల్ వృద్ధ జనాశ్రయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తనయుడు నిఖిల్ రత్న మంగళవారం సాయంత్రం 45 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, మంత్రి రావు వెంకటరత్నం, తాతపూడి మారుతీరావు, ఒమ్మిరాంబాబు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి : జేసీ


మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : ధాన్యం కొనుగోళ్లలో ఏవిధమైన లోటుపాట్లు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, డీఐవోఎస్‌లు, ఏడీఎస్‌లు, ఎంఏవోలు మండల సర్వేయర్లు, తదితరులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జిల్లాలో 248 రైతు సేవా కేంద్రాల ద్వారా 1లక్ష 72 వేల మెట్రిక్ టన్నులు ధాన్యమును కొనుగోలు చేవామన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. దీనికి సంబంధించి రూ.390 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా రూ.383 కోట్లు రైతులు ఖాతాల్లో జమ చేశామన్నారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు. డీఆర్వో మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి పై దోసిరెడ్డి, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ టి.శివరాంప్రసాద్, డీఎస్‌వో ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలి


మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న భూపతిరాజు రవీంద్రరాజు

భీమవరంటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను వీఆర్‌వోల రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు ప్రయత్నాల్లో రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా గ్రామస్థాయిలో పనిచేస్తున్న గ్రామ రె వెన్యూ అధికారులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 15 వేల మంది వీఆర్‌వోలు ఉన్నారని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించి అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, ఎన్టీఆర్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ సయ్యద్ బాబ్జి, సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు వి.వెంకట రామిరెడ్డి , షేక్ ఇబ్రహీం సాహెబ్ పాల్గొన్నారు.

నేత్రదానం

ఆకివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు పట్టణానికి చెందిన గొంట్లా స్వరాజ్యలక్ష్మి (88) మంగళవారం మరణించారు. కుటుంబ సభ్యులు కోరిక మేర స్థానిక ఆదర్శ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిడదవోలు లయన్స్ ఆసుపత్రి టెక్నీషియన్ సుందరం వచ్చి కార్నియాలు సేకరించారని క్లబ్ సభ్యుడు చొప్పెర్ల శ్రీరామచంద్ర మూర్తి తెలిపారు. నేత్రదానం చేసి పలువురికి కంటిచూపు రావడానికి కారకులు కావాలన్నారు.

వేగవంతంగా టీడీపీ సభ్యత్వ నమోదు


ఉండి కాపులపేటలో టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్న పేరయ్య దంపతులు

ఉండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతంగా జరుగుతుందని యూనిట్ ఇన్‌చార్జి గురుగుబిల్లి వెంకటసత్యనారాయణ తెలిపారు. బూత్ ఇన్‌చార్జిలు చెన్నంశెట్టి హరి నాయుడు, బండారు సుబ్బారావు, నల్లా వల్లి నమోదు చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాపులపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం మాజీ చైర్మన్ గంగుమోలు పేరయ్య దంపతులకు టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేయించారు. సభ్యత్వం కార్యక్రమంలో అశోక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రాలో ఇసుక, లిక్కర్ మాఫియా : కొట్టు


మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రాలో ఇసుక, లిక్కర్ మాఫియా నడుస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయన్నారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలచందర్‌కు ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



బాల చందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో స్పందన ఈద ఫౌండేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్ ఈద సామ్యూల్ రెడ్డి అధ్యక్షతన కాప్త్యోన్ స్టార్ హోటల్ ఆడిటోరియంలో 'స్పందన వెల్‌నెస్ వేవ్స్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పెనుగొండకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ బాలచందర్ సాదే ముఖ్యఅతిథిగా పాల్గొని జీవిత విలువలను యువత సాధించాల్సిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా స్పందన ఇంటర్నేషనల్ చైర్మన్ సామ్యూల్‌రెడ్డి కార్యవర్గం బాలచందర్‌ను అభినందిస్తూ ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుతో ఘనంగా సత్కరించినట్లు ఆయన తెలిపారు. ఆయనను ఎస్‌వీకేపీ కళాశాలల ప్రెసిడెంట్ తాడి నాగిరెడ్డి, డాక్టర్ కె.రామచంద్రరాజు,దుబాయ్‌లోని తెలుగు సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ధాన్యానికి మద్దతు ధర రూ.1600 ఇవ్వాలని ధర్నా


వల్లూరులో ధాన్యం రాశి వద్ద రైతు సంఘం నాయకుల ఆందోళన

ఆచంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇందుకూరి సూర్యనారాయణరాజు అన్నారు. వల్లూరులో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధాన్యం రాశులను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం రాశుల వద్ద ఆందోళన చేపట్టారు. కనీస మద్దతు ధర రూ.1600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి టి.మోహనరావు, బోడపాటి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు, బోళ్ళ సుబ్బారావు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గుముఖం

» ఊపిరి పీల్చుకున్న రైతులు » సార్వా మాసూళ్లలో నిమగ్నమైన రైతులు



పడమరవిప్పర్రు, ఆచంటలో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

పెంటపాడు/ఆచంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా మూడు రోజులుగా రైతులకు కంటిపై కునుకు లేకుండా కురిసిన వర్షాలు మంగళవారం తగ్గుముఖం పట్టాయి. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే జిల్లాలో సగానికి పైగా సార్వా మాసూళ్లు ముగిశాయి. మెట్ట ప్రాంతాల్లో దాళ్వా నారుమడులకు రైతులు సంసిద్ధమవుతున్నారు. తుఫాను కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు వరికోతలు మూడు రోజులు నిలిపివేయాలని అధికారులు సూచనలు చేశారు. అయినప్పటికి అప్పటికే కోసిన ధాన్యం కల్లాలపై ఉండిపోవడంతో రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. మంగళవారం ఎండకాయడంతో వర్షం కారణంగా తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని ఒబ్బిడి చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షంతో పాటు గాలులు కూడా విపరీతంగా వేయడం వల్ల కొన్ని ప్రాంతాల్లో వరిచేలు నేలకు ఒరిగాయి. పడిపోయిన చేలను మిషన్ ద్వారా కోసేందుకు అదనపు ఖర్చును భరించి మాసూళ్ళు పూర్తి చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆచంట మండలంలో పలువురు రైతులు తడిచిన ధాన్యాన్ని ఎండబెట్టుకున్నారు. మరోవైపు మేఘాలు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసే అవకాశం లేదని అధికారులు సూచనలతో మాసూళ్ల పనుల్లో నిమగ్నమయ్యారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



కాళ్లలో దాతలు అందించిన జారుడు బల్లపై దివ్యాంగుడు..పాలకొల్లులో బహుమతులు అందిస్తున్న ఎంఈవో శర్మ

భీమవరం క్రైం/భీమవరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'మానసిక దివ్యాంగులకు సరైన చేయూతనందిస్తే సమాజంలో విభిన్న రంగాల్లో ప్రతిభావంతులుగా రాణిస్తారని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ (న్యూటన్) అన్నారు. మంగళవారం ప్రపంచ వైకల్య దినోత్సవం సందర్భంగా భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉండి రోడ్డులోని భవిత మానసిక వికలాంగుల కేంద్రాన్ని సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. భీమవరం శ్రీవేంకటేశ్వర బధిర పాఠశాల ప్రిన్సిపాల్ పుణ్యవతి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

- ఆచంట/పెనుమంట్ర : జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆచంట మండలం ఆచంట భవిత కేంద్రం వద్ద ఎంఈవోలు ఎంఈవోలు ఎ. ఉషారాణి, టి.రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో చిన్నారులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పెనుమంట్ర మండలం ఆలమూరు భవిత దివ్యాంగుల పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెనుమంట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంఈవో యు.నాగేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన వారికి మానవత సభ్యుల సహకారంతో బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం జోగిరెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తేతలి లోకనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు
- ఆకివీడు/పాలకోడేరు/కాళ్ల/ఉండి,ఆకివీడు జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం తోట పోతురాజు ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశా రు. ఉపాధ్యాయురాలు మార్తమ్మను సన్మానిం చారు. పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామం లోని భవిత సెంటర్‌లో పాఠశాల హెచ్‌ఎం రమణరాజు ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. భవిత సెంటర్ ఉపాధ్యాయులు రాణి, జానకి తదితరులు పాల్గొన్నారు. కాళ్ళ మండలం పెద అమిరంలోని అరుణోదయ మనో వికాస కేంద్రా నికి సుమారు రూ. 80 వేలు విలువైన ఆట వస్తువులను కేంద్రం డైరెక్టర్ చింతలపాటి అరుణాదేవికి దాతలు చెన్నంశెట్టి శ్రీనివాస్, యర్రా సత్యనారాయణ అందించారు. చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు పాల్గొన్నారు. ఉండి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం శేషయ్య అధ్యక్షతన గ్రామసర్పంచ్ కమతం సౌజన్య, ఎంపీటీసీ కునుకు రమాదేవి ఆధ్వర్యంలో దివ్యాంగులకు లయన్స్ క్లబ్ ఆర్థిక సహకారంతో బహుమతులు అందించారు.
- నరసాపురం టౌన్ : దివ్యాంగుల కోసం సదరం సర్టిఫికెట్ క్యాంపులు ఏర్పాటు చేయాలని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. మంగళవారం నరసాపురం పట్టణంలోని శ్రీహరిపేటలో భవిత విద్య వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్యాంసుందర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. స్పందించిన ఆయన త్వరలో అన్ని చోట్ల క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులందించారు. వలంధర్ రేవు వద్ద నిర్వహించిన దివ్యాంగుల అంతర్జాతీయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ వెంకటరమణ విచ్చేశారు. కొప్పర్రు జనసేన నాయకులు దివ్యాంగుల సంక్షేమానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు.
- పెంటపాడు : పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాలలో ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, టీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన దివ్యాంగ విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. మానవతా విద్యాకమిటీ కన్వీనర్ తాడేపల్లి మోహన్‌రావు, హెచ్‌ఎం రాజేష్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు సాయి స్వరూప, మస్తాన్ బీ, పేరెంట్ కమిటీ చైర్మన్ కళింగ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : వైకల్యం శరీరానికే కానీ మనస్సుకు కాదని ఎంఈవో ఆర్ఎస్‌వీ గంగాధర శర్మ సూచించారు. పట్టణంలోని శ్రీరామ్‌పేటలోగల భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు, బిస్కెట్లు, పండ్లు అందించారు. ఫిజియోథెరపీ డాక్టర్ గోగులమండ ఆమోస్, హెచ్‌ఎం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- తణుకు/ఇరగవరం : దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు అన్నారు. తణుకు భవిత కేంద్రం వద్ద పారా లీగల్ వలంటీర్లు దివ్యాంగులకు ఉన్న చట్టాలు, హక్కులను వివరించారు. న్యాయవాదులు కనకదుర్గా భవాని, అజయకుమార్, విద్యాశాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇరగవరం భవితా కేంద్రంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కడలి సత్యనారాయణ, ఐఈడీఎస్ఎస్ పి.తులసి ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వి.నాగమణి, పి.రేణుకా, తదితరులు పాల్గొన్నారు.


ఆచంటలో పోలీసుస్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

ఆచంట పోలీసు స్టేషన్‌లో ఎస్పీ నయీం తనిఖీ

ఆచంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆచంట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నయీం అస్మి మంగళవారం వార్షిక తనిఖీలలో భాగంగా పరిశీలించారు. కేసులకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆచంటలో నూతనంగా నిర్మించిన పోలీసు స్టేషన్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించేలా పోలీసులు తమ విధులు నిర్వర్తించాలని ఎక్కడ ఎటువంటి గొడవలు లేకుండా చూడాలని సూచించారు. నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, సీఐ రాయుడు సత్యనారాయణ, ఎస్ఐ కట్టా వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.


అద్దాల మండపాన్ని పరిశీలిస్తున్న దాత వెంకట్రావు, నిర్వాహకులు

ఆకివీడు ఆధ్యాత్మికానికి దిక్సూచిగా మారాలి

ఆకివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు ఆధ్యాత్మికానికి దిక్సూచిగా మారాలని, అందుకు అనుగుణంగా పట్టణంలో నూతన దేవాలయాల నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రముఖ పారిశ్రామికవేత్త చుండూరి వెంకట్రావు అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం సుమారు రూ2 కోట్లతో పున:నిర్మాణంలో భాగంగా అద్దాల మండపం నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పనులను పరిశీలించి మాట్లాడారు. యువతలో కూడా ఆధ్యాత్మిక చింతన పెరుగుతుండడం శుభసూచికం అన్నారు. ఆలయ నిర్వాహకులు నేరెళ్ళ రామకృష్ణ, మన్నే పోతురాజు, మోరా శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

సుబ్బరాయుడు గుడిలో షష్టికి దర్శనాలు మాత్రమే

భీమవరంటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపురంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 7 నుంచి జరిగే షష్ఠి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏడో తేదీ సుబ్రహ్మణేశ్వర స్వామి షష్టి రోజున దర్శనాలు మాత్రమే ఉంటాయని ఈవో బ్రహ్మారెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఆలయ పునః నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, స్వామివారికి జరిగే రథోత్సవం, తెప్పపై ఉత్సవం ఈ ఏడాది ఉండవని స్పష్టం చేశారు. భక్తులు సహకరించాలని కోరారు.

ప్రణాళికతో ముందుకెళ్తున్నాం

ఆకివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు బుక్ చేసుకున్న గ్యాస్ సిలెండర్ ఒక రోజులో అందించడానికే ఏజెన్సీలు పెంచుతున్నామని విశాఖపట్నం హెచ్‌పీ గ్యాస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక సిద్ధాపురం వైపు వెళ్లే రోడ్‌లో ఏర్పాటు చేసిన నూతన ఏజెన్సీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 42 డీలర్లు ఉన్నారన్నారు. గ్యాస్ వినియోగదారులకు ఎటువంటి ఆటంకం కల్గించకుండా ప్రణాళికతో ముందుకెళ్ళుతున్నామన్నారు. స్టాఫ్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రొప్రయిటర్ కంభంపాటి వల్లీ శివరామలక్ష్మి, మేనేజింగ్ పార్టనర్ కంభంపాటి త్రినాధ కృష్ణమూర్తి, తహసీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు తదితరలు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం ప్రచారం

భీమవరం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ, ఏపీటీఎఫ్, పీఈటీ తదితర సంఘాలు బలపరిచిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావు పట్టణంలో మంగళవారం విస్తృత ఎన్నికల ప్రచార నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, జేఎల్‌బీ, కేజీఆర్ఎల్ జీటీపీటీ, పీఎస్ఎం, నల్లం వారి స్కూల్ తదితర విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిసి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు డివిజన్‌లో 8 పోలింగ్ కేంద్రాలు


మాట్లాడుతున్న ఆర్డీవో దాసిరాజు

నరసాపురం టౌన్/మొగల్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సబ్ డివిజన్‌లో ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశా మని ఆర్డీవో దాసిరాజు చెప్పారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గురువారం జరిగే ఎన్నికలకు నరసాపురం డివిజన్‌లో ఎనిమిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నరసాపురంలోని స్టీమర్‌రోడ్‌లో, పాలకొల్లులోని బీఆర్ఎస్ స్కూల్, ఆచంట, మొగల్తూరు, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం 1,460 ఓట్లు ఉన్నాయన్నారు. అత్యధికంగా పాలకొల్లు బూత్‌లో 480, నరసాపురంలో 425 ఓట్లు ఉండగా, ఆచంటలో అత్యల్పం 63, మొగల్తూరు 88, పోడూరు 71 ఓట్లు ఉన్నాయన్నారు. మొత్తం 40 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. అదనంగా ఎనిమిది మంది పనిచేస్తారన్నారు. బుధవారం సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందిస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ కె.రాజకిషోర్ మంగళవారం తెలిపారు. మొగల్తూరులోని పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 116వ పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గురువారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.


మద్యం దుకాణాలకు సీల్ వేయిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ కరుణప్రియ

మద్యం దుకాణాలు బంద్

ఆకివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మద్యం దుకాణాలు బంద్ చేయిస్తున్నామని ఎక్సైజ్ ఎస్ఐ కరుణప్రియ తెలిపారు. మంగళవారం మద్యం దుకాణాలు, బార్‌కు సీల్ వేయించి మాట్లాడారు. ఈ నెల 5న జరుగుతున్న శాసన మండలి ఎన్నికలు సందర్భంగా ఆకివీడు మండల పరిధిలోని పది మద్యం దుకాణాలు, ఒక బార్‌కు సీల్ వేశామన్నారు. శనివారం నాలుగు గంటలు తరువాత సీల్స్ తొలగిస్తామన్నారు.

బాలికలు స్వేచ్ఛగా చదువుకునేలా ప్రోత్సహించాలి



అత్తిలిలో మాట్లాడుతున్న సీడీపీవో ప్రమోదిని కుమారి

అత్తిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాలికలు స్వేచ్ఛగా చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు సీడీపీవో ఎం.ప్రమోదిని కుమారి అన్నారు. అత్తిలి ఎంపీడీవో కార్యాలయంలో కిశోర్ వికాసం కార్యక్రమం ఎంపీడీవో పి.శ్యామ్యూల్ అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాపై బాలికలు అప్రమత్తంగా ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాలికలు బాల్యవివాహాలు, పోక్సో చట్టం, లైంగిక వేధింపులు, లింగ వివక్షత, అక్రమ రవాణా, ఆత్మరక్షణ కోర్సులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం.శ్రీదేవి మాట్లాడారు. మహాలక్ష్మి బీపీసీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు మాధురి, పుష్పలత, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

- తాడేపల్లిగూడెం రూరల్ : కిశోర బాలికల వికాసంతోనే సమాజ అభివృద్ధి చెందుతుందని డాక్టర్ శ్రావణి పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌వీ మంగతాయారు, జిల్లా ట్రైనర్ కల్పన, విజయకుమారి, సూపర్‌వైజర్ దుర్గాభవాని పాల్గొన్నారు.
- గణపవరం : గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మహిళా చట్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయవాది జిలాని బాషా మాట్లాడుతూ గృహహింస, పోక్సో తదితర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ నిర్మలకుమారి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు స్వరూపరాణి, అక్కిరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.
- పాలకోడేరు : బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా వంటివి బాలికల అభివృద్ధికి ఆటంకాలుగా మారాయని ఎంపీడీవో రెడ్డియ్య, సీడీపీవో వాణి విజయరత్నం అన్నారు. మంగళవారం పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో బాలల వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ స్వర్ణనిరంజని, అధ్యాపకులు గజలక్ష్మి, సునీత, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

కళాకారుడు సత్యనారాయణకు సత్కారం


సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కళాపరిషత్ వ్యవస్థాపకుడు, రంగస్థల కళాకారుడు మానాపురం సత్యనారాయణకు చత్తీస్‌ఘడ్‌లోని బిలాయ్‌లో సోమవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈవిషయాన్ని మంగళవారం ఆయన విలేకర్లకు తెలిపారు. బిలాయ్‌లో ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి నాటికల పోటీల్లో న్యాయ నిర్ణేతగా వ్యవహరించానన్నారు. ఈ సందర్భంగా మానాపురంను సంస్థ అధ్యక్షుడు ఎల్.రుద్రమూర్తి, కార్యదర్శి కె.శ్రీనివాస్, సభ్యులు పాల్గొని మానాపురం నాటక రంగానికి చేస్తున్న కృషిని అభినందించారన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

పెంటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ఎయిడ్స్ డే ను పురస్కరించుకుని పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ తీవ్రత, ప్రమాదంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కుసుమ కుమారి, విజయబాబు, జి.వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు.. ఆరుగురి అరెస్ట్

నరసాపురం/మొగల్తూరు/పెనుగొండ/ తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎన్.రాంబాబు మంగళవారం తెలిపారు. పెనుగొండ మండలంలో ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 29 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ బి.లక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగుంటలో టపా సూర్యనారాయణ అక్రమ మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసి 36 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

భావితరాలకు మార్గదర్శి 'కల్విట్'

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు కల్విట్ మార్గదర్శకులని వక్తలు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఎల్ఐసీ కార్యాలయం వద్ద మంగళవారం జీవిత బీమా డెవలప్‌మెంట్ అధికారి, యూనియన్ ఫౌండర్ కల్విట్ శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యపరీక్షలకు భారీగా తరలి వచ్చిఆరు. కార్యక్రమంలో ఆర్కే ఎండోకేర్ వైద్యులు రాధాకృష్ణ, బ్రాంచి డెవలప్‌మెంట్ అధికారులు ప్రసాద్, సుబ్బారావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.